

11న సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడా ఎంపికలు

శ్రీకాకుళం సిటీ : జిల్లాలోని ప్రభుత్వ సివిల్ సర్వీస్ ఉద్యోగుల కోసం జిల్లాస్థాయి క్రీడా ఎంపికలను నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎ.మహేష్‌బాబు ఒక ప్రకటనలో కోరారు. ఈ ఎంపికలు ఈనెల 11న ఉదయం తొమ్మిది గంటలకు కోడి రామ్మూర్తి స్టేడియం వేదికగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖో ఖో, టెన్నిస్, పవర్ లిఫ్టింగ్ అండ్ వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, రెజ్లింగ్, స్విమ్మింగ్, యోగా, డాన్స్, మ్యూజిక్ షార్ట్‌ఫిల్మ్ వంటి మొత్తం 19 క్రీడాంశాల్లో ప్రతిభావంతులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాస్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను ఈనెల 19 నుంచి 22 వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. సందేహాల నివృత్తికి కోచ్ ఎం.మాధురీలత ఫోన్ నంబరు 9440963128 సంప్రదించాలని సూచించారు.

స్వపక్షంలో విపక్షం

- డిఆర్‌సిలో ప్రభుత్వ శాఖల వైఫల్యాలపై ఎమ్మెల్యే కూన రవికుమార్ నిలదీత
- వ్యవసాయశాఖ విఫలమైందంటూ అచ్చెన్న సమక్షంలోనే విమర్శలు
- బయటపడ్డ ప్రభుత్వ పథకాల డొల్లతనం
- పలుమార్లు సర్దిచెప్పేందుకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి శ్రీనివాస్ యత్నం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి శ్రీనివాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లా సమీక్షా కమిటీ సమావేశం (డిఆర్‌సి)లో ఎమ్మెల్యే కూన రవికుమార్ సంధించిన ప్రశ్నలు ప్రభుత్వ పథకాల డొల్లతనాన్ని బట్టబయలు చేశాయి. సమావేశం ప్రారంభం నుంచి చివరి వరకు ఆయన అడిగిన ప్రశ్నలు ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేశాయి. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన డిఆర్‌సి సమావేశంలో పలు ప్రభుత్వ శాఖల వైఫల్యాలను ఆయన ఎండగట్టారు. చివరకు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలోనే ఆ శాఖ విఫలమైందంటూ అధికారులనుద్దేశించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం ప్రారంభం నుంచి చివరి వరకు ఏ ఒక్క శాఖను ఆయన విడిచి పెట్టలేదు. ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పలుమార్లు సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా ప్రశ్నల పరంపర కొనసాగించారు.

డిఆర్‌సిలో తొలుత వ్యవసాయశాఖపై సమీక్ష చేపట్టారు. వ్యవసాయశాఖ జెడి మనోహరరావు ప్రగతి నివేదిక చదువుతుండగా జెడి చెప్తున్న అంశాలకు, పవర్ పాయింట్ స్క్రీన్‌పై చూపుతున్న అంశాలకు వ్యత్యాసం ఉందంటూ ఏదీ నిజమంటూ ప్రశ్నించారు. వరి పంట ఈ-క్రాప్‌లో నమోదు కాకుంటే ధాన్యం కొనుగోలుకు అవకాశం ఉండదంటూ చెప్పారు. ఈ-క్రాప్‌కు, టెక్నికల్ అంశాలకు సంబంధం లేదని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పగా కచ్చితంగా సంబంధం ఉందంటూ ఎమ్మెల్యే కూన రవికుమార్ తోసిపుచ్చుతూనే, ప్రభుత్వ ఉత్తర్వుల్లో అలా ఉన్నా క్షేత్రస్థాయిలో అలా లేదన్నారు. ఈ ఏడాది రైతులకు పొటాష్ ఇవ్వలేకపోయారని, ఇది వ్యవసాయశాఖ వైఫల్యమంటూ మరోసారి ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

అన్నదాత సుఖీభవపై వాడీవేడి చర్చ

అన్నదాత సుఖీభవ పథకంపై ఎమ్మెల్యే కూన రవికుమార్ లేవనెత్తిన అంశాలతో వాడివేడి చర్చ సాగింది. పిఎం కిసాన్ పథకం కింద 2,79,100 మందికి ఇస్తుంటే, అన్నదాత సుఖీభవ పథకం కింద 2,32,901 మందికి ఇవ్వడమేమిటని ఎమ్మెల్యే రవికుమార్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సర్దిచెప్పే ప్రయత్నం చేయగా, డిఆర్‌సి స్టాట్యూటరీ బాడీ అన్ని కలెక్టర్ నిర్వహించే సమావేశాల మాదిరి కావని చెప్పారు. వ్యవసాయశాఖ అధికారులు సరైన సమాచారం, వివరాలు తీసుకురాకుండా ఎందుకు వస్తున్నారని.. టీ, స్నాక్స్ తినడానికా అంటూ వారిపై విరుచుకుపడ్డారు. సమస్యలు చర్చించమని చెప్తే వెళ్లిపోతామంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



సమస్యలపై ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

చర్చకు వచ్చిన ఇతర అంశాలు ఇవే...

ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ వరదల కారణంగా రంగు మారిన ధాన్యాన్ని కూడా తక్షణ చర్యలు తీసుకుని కొనుగోలు చేయాలని కోరారు.

ఆమదాలవలస సుగర్ ఫ్యాక్టరీ స్థానంలో ఎంఎస్‌ఎంఇ పార్కు అభివృద్ధి చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని కోరగా, ఆ దిశగా చర్యలు చేపడతామని ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బదులిచ్చారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ శ్రీకాకుళం మండలం పాత్రునివలస ఎంఎస్‌ఎంఇ భాగంగా ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లో గ్రౌండ్ ఫ్లోర్ మాత్రమే పెడుతున్నారని, మరో రెండు ఫ్లోర్లు కట్టే అవకాశాల్ని పరిశీలించాలని కోరారు. రణస్థలం ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు మాట్లాడుతూ గ్రామస్థాయి సెక్రటేరియట్ సిబ్బందిని సంబంధిత ఎమ్మెల్యేల దృష్టిలో పెట్టకుండా డెప్యుటేషన్ పంపిస్తున్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు.

పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ కిడ్నీ హాస్పిటల్ కోసం ప్రత్యేకంగా ఉద్దానం ప్రాజెక్టు నుంచి పైపులైను వేసి నీరందించాలని కోరారు. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల కింద రోడ్లు వేయడానికి అనుమతుల పెండింగ్‌పై స్పందిస్తూ.. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఈ సమస్య పరిష్కారానికి కేంద్ర అటవీ మంత్రిత్వ శాఖతో మాట్లాడతానని హామీనిచ్చారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, డిసిఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, సుడా చైర్మన్ కె.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తీరం కోత పరిష్కారానికి చర్యలు

కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు



కోతకు గురైన తీరాన్ని పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్, సిటీ

పెద్దగణగళ్లవానిపేటలో నాగావళి నది సముద్రంలో కలిసే ప్రాంతంలో తీరం కోతకు గురవుతోందని, దీని పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అధికారులను ఆదేశించారు. శ్రీకాకుళం రూరల్ మండలంలోని పెద్దగణగళ్లవానిపేట గ్రామాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి కేంద్ర మంత్రి బుధవారం పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.1.40 కోట్లతో నిర్మించనున్న స్టోరేజ్ షెల్టర్ భవనానికి శంకుస్థాపన చేశారు. కోతకు గురవుతున్న తీరాన్ని పరిశీలించిన ఆయన, నాగావళి నది సముద్రంలో కలిసే దిశను మార్చుకుంటూ వెళ్లడం ప్రమాదకరమన్నారు. యథావిధిగా ప్రవాహ దిశ ఉండేలా తిరిగి ఏర్పాటు చేసేందుకు ప్రాజెక్టును రూపొందించాలని సూచించారు. కోస్టల్ రీసెర్చ్ సెంటర్ ఇచ్చిన సూచనల మేరకు నది దిశను యథావిధిగా ఉంచే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అందుకు సమాంతరంగా రెండో దశలో ఈ ప్రాంతంలో ఫిషింగ్ జెట్టి కూడా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, ఇతర అధికారులు, నాయకులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

మహిళా క్రికెట్ టీమ్ స్ఫూర్తి కావాలి

విద్యార్థినులు విశ్వవిజేతగా నిలిచిన మహిళా క్రికెట్ జట్టును ఆదర్శంగా తీసుకోవాలని, పట్టు వదలకుండా లక్ష్యాలను చేరుకోవాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సూచించారు. నగరంలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో కొవ్వాడ న్యూక్లియర్ పవర్ ప్లాంట్ సిఎస్‌ఆర్ నిధులు రూ.99 లక్షలతో నిర్మించిన అదనపు భవన సముదాయాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి కూర్చొన్న ఆయన వారితో మాట్లాడారు. తన తల్లి చదివిన కళాశాలకు తాను బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటానని హామీనిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అందుకనుగుణంగానే ఈ కళాశాల అభివృద్ధికి ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు తెలిపారు. ఐదు గదులతో నిర్మించిన అదనపు భవనంతో పాటు భవిష్యత్‌లో మరిన్ని భవనాలు నిర్మిస్తామన్నారు. జిల్లా అభివృద్ధి చెందాలంటే పరిశ్రమల సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్, ఆర్‌డిఒ కె.సాయి ప్రత్యూష, రాష్ట్ర విద్యా సంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ పి.ఎం.జె బాబు, కొవ్వాడ అణు విద్యుత్కేంద్రం డైరెక్టర్ రవికుమార్, కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి- రణస్థలం

జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పైడిభీమవరంలో గంజాయి విక్రయిస్తుండగా ఆగస్టులో కొంతమంది వ్యక్తులను పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించామని, అప్పట్లో పరారైన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించినట్లు జె.ఆర్ పురం సిఐ ఎం.అవతారం తెలిపారు. జె.ఆర్ పురం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్.కె.నఫీజ్, కమ్మిశెట్టి వినోద్ కుమార్ విజయవాడ కె.ఎల్ యూనివర్సిటీలో బిటెక్ చదువుతున్నారని, చెడు వ్యసనాలకు బానిసై ఇటువంటి నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. విజయవాడ మంగళవారం వెళ్లి వారిని పట్టుకున్నామన్నారు. సమావేశంలో ఎస్ఐ ఎస్.చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

కెజిబివిలపై సోలార్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కెజిబివిలపై సోలార్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సమగ్ర శిక్ష ఎపిసి శశిభూషణ్‌ని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెసిడెన్షియల్ స్కూల్స్, కెజిబివిలకు సంబంధించి మరమ్మతులపై బుధవారం సమావేశం నిర్వహించారు. రెసిడెన్షియల్ స్కూల్స్ జిల్లా కో ఆర్డినేటర్ యశోదలక్ష్మి మాట్లాడుతూ ఇంజినీరింగ్ అధికారులు రెసిడెన్షియల్ స్కూల్స్ మరమ్మతులకు అంచనాలు తయారు చేసినట్లు కలెక్టర్‌కు వివరించారు. తొమ్మిది రెసిడెన్షియల్ పాఠశాలల మరమ్మతులకు రూ.కోటి అంచనాలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఏ గురుకులంలో ఇంకా సమస్యలు ఉంటే తెలియజేయాలని ప్రిన్సిపాల్స్‌కు సూచించారు. ఫ్లోరింగ్ సరిగా లేకపోతే గ్రానైట్ వేయాలని ఆదేశించారు. పాఠశాలల వారీగా ఉన్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు.

జిల్లాలో 25 కెజిబివిలు ఉన్నాయని సమగ్ర శిక్ష ఎపిసి శశిభూషణ్ తెలిపారు. కోటబొమ్మాళి కెజిబివిలో కాంపౌండ్ వాల్ జెసిబి తగిలి పడిపోయిందని ప్రిన్సిపాల్ చెప్పారు. సిసి డ్రైనేజీ సమస్య ఉన్నట్లు తెలిపారు. కెజిబివిల వారీగా డార్మిటరీ, కిచెన్, డైనింగ్, తదితర సమస్యలను ప్రిన్సిపాల్స్ కలెక్టర్‌కు వివరించారు. అన్ని రెసిడెన్షియల్ స్కూల్స్, కెజిబివిలపై ఫ్లోర్లకు పిల్లలు ఎవరూ వెళ్లకుండా గేట్లు ఏర్పాటు తాళాలు వేయాలని ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి రవికుమార్, రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్ యశోద, కెజిబివిల ప్రిన్సిపాల్స్, డబ్ల్యుఐడిసి, ఎపిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర దర్యాప్తు చేయాలి

ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి అప్పన్న

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని బందపల్లి గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయురాలు కాళ్లు నొక్కించుకుంటున్న ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యాన బందపల్లి గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్‌లో సరైన మౌలిక సౌకర్యాలు, తగిన సిబ్బంది లేకపోవడం అన్యాయమన్నారు. ప్రహరీ నిర్మాణం ఇంకా పెండింగ్‌లో ఉందని, విద్యార్థులకు దోమతెరలు ఇవ్వలేదన్నారు. టీచర్లే వార్డెన్, ఎఎన్‌ఎంగా పనిచేయాల్సి వస్తోందన్నారు. ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 185 మంది పిల్లలకు కుక్, కమాటీ ఉన్నా సరిపోవడం లేదని, మరో ఇద్దరిని శాశ్వత ప్రాతిపదికన నియమించాలన్నారు. స్కూల్ ఆవరణలో ఆరు స్తంభాలకు లైట్లు వేయాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఆరిక మన్మథరావు, సవర భాస్కరరావు, బత్తాడసింగి గవరయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి అప్పన్న




మాట్లాడుతున్న ఎన్‌జిఒ అసోసియేషన్ అధ్యక్షులు సాయిరాం

జర్నలిస్టుల హక్కుల పరిరక్షణలో ఎపిడబ్ల్యుజెఎఫ్ పాత్ర ప్రశంసనీయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జర్నలిస్టుల హక్కుల పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) పాత్ర ప్రశంసనీయమని పలు ఉద్యోగ, పౌరసంఘాల ప్రతినిధులు కొనియాడారు. విలువలు, ప్రమాణాలతో కూడిన పాత్రికేయులను ఈ సంఘం ప్రోత్సహిస్తుందన్నారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలోని ఎన్‌జిఒ హోంలో 'జర్నలిస్టుల హక్కులు - బాధ్యతలు - చట్టాలు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.వేణుగోపాల్ అధ్యక్షత వహించిన సమావేశంలో ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ఫెడరేషన్ చూపిస్తున్న చొరవ, ప్రశంసనీయమన్నారు. పత్రికలు ప్రజాస్వామ్య సౌధానికి మూలస్తంభం వంటివని తెలిపారు. విశ్రాంత జెడ్‌పి సిఇఒ సురంగి మోహనరావు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణ, ఉద్యోగ భద్రత, రక్షణకు సహకరించాలని కోరారు.

తొలుత ఇటీవల మరణించిన సీనియర్ పాత్రికేయులు కిల్లాన మోహన్‌బాబు, చౌదరి లక్ష్మణరావు మృతికి సంతాప సూచికంగా మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సదాశివుని కృష్ణ, జి.లక్ష్మణరావు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఎం.ప్రసాదరావు, కొమ్ము రమణమూర్తి, బి.వి రవిశంకర్, జెసిఐ ప్రతినిధులు బెందాళం వరలక్ష్మి, తమ్మినేని ఉషారాణి, మణిశర్మ, లయన్స్ ప్రతినిధులు బాడాన దేవభూషణరావు, వావిలపల్లి జగన్నాథంనాయుడు, బిసి సంఘ నాయకులు జి.కృష్ణ, జర్నలిస్టు సంఘాల ఐక్యవేదిక నేతలు బొడ్డేపల్లి ప్రసాదరావు, ఎస్.జోగినాయుడు, జి.షణ్ముఖరావు, భేరి చిన్నారావు, డోల అప్పన్న, సిహెచ్.నాగభూషణ్, తదితరులు పాల్గొన్నారు.



కుక్కల దాడిలో మృతి చెందిన మేకలు

కుక్కల దాడిలో 20 మేకలు మృతి

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

మండలంలోని ఇసకలపాలెం గ్రామంలో వీధి కుక్కల దాడిలో కొయ్యాన ఎర్రయ్యకు చెందిన 20 మేకలు బుధవారం మృత్యువాత పడ్డాయి. బాధితుల కథనం ప్రకారం ఎర్రయ్య సుమారు వంద మేకలను మేపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మేకలను మేతకు తీసుకెళ్లి వచ్చాక ఎప్పట్లాగే ఇంటికి సమీపంలోని ప్రాంతంలో వాటిని ఉంచాడు. తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో ఎనిమిది వీధి కుక్కలు మేకల మంద ఉన్న ప్రాంతంలో ప్రవేశించి దాడి చేయడంతో 20 మేకలు మృతి చెందాయి. వీటి విలువ రూ.మూడు లక్షల వరకు ఉంటుందని బాధితుడు ఎర్రయ్య తెలిపారు. కుక్కల దాడిలో గాయపడిన మిగిలిన మేకలను పెద్ద సవలాపురం గ్రామ సచివాలయ పశు వైద్య అసిస్టెంట్ పరిశీలించారు. మేకల మీదే ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు భారీ నష్టం వాటిల్లిందని భోరున విలపిస్తున్నారు. సర్పంచ్ పల్లి సురేష్ బాధితులను ఓదార్చారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లి బాధిత కుటుంబాన్ని ఆదుకునే ప్రయత్నం చేస్తామని తెలిపారు.

చంద్రబాబు మెప్పు కోసం అచ్చెన్న విమర్శలు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దగ్గర మెప్పు కోసమే మంత్రి అచ్చెన్నాయుడు జగన్‌పై విమర్శలు చేస్తున్నారని వైసిపి టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. టెక్కలిలోని వైసిపి కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. జగన్‌పై విమర్శలు చేయడానికే అచ్చెన్న పర్యటనలు తప్ప ప్రజలకు ఏం మేలు చేశారో బహిరంగ చర్చకు రావాలన్నారు. జగన్ పాలనలోనే జిల్లాకు రూ.86 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంతమంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చారో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. తుపాను బాధిత రైతుల కష్టాలు తెలుసుకోవడానికి వెళ్లిన జగన్ పర్యటనతో కూటమి నాయకులకు భయం పట్టుకుందన్నారు. అందుకే అచ్చెన్నాయుడు మైక్ పట్టుకుని ఉన్మాదిలా ఊగిపోతున్నారని ఆరోపించారు. కింజరాపు కుటుంబానికే చంద్రబాబు సూపర్ సిక్స్ నజరానాలు ఇచ్చారని విమర్శించారు. రామ్మోహన్ నాయుడుకు కేంద్ర మంత్రి, అచ్చెన్నాయుడుకు రాష్ట్ర మంత్రి, కింజరాపు ప్రభాకర్‌కు ఉద్యోగ విరమణ ముందు ప్రమోషన్, ఆ తర్వాత విజిలెన్స్ ఒఎస్‌డి పోస్టు, ఇప్పుడు ఏకంగా జిల్లాకు విజిలెన్స్ ఎస్‌పి ఇన్‌ఛార్జి పోస్టును నియమించారని తెలిపారు. అచ్చెన్నాయుడు సొంత అన్న కొడుకు సురేష్‌కు రాష్ట్రపతి చేతుల మీదుగా ఉత్తమ పంచాయతీ అవార్డు, సమీప బంధువు ముద్దాడ రవిచంద్రకు సిఎంఒ కార్యాలయంలో కీలకమైన పోస్టు, సమీప బంధువు లక్ష్మీనారాయణ హైకోర్టు పిపిగా నియమించారని తెలిపారు. సూపర్ సిక్స్ అంటే ఇవే కదా అని ఎద్దేవా చేశారు.

జల జీవన్ మిషన్ పనులు వేగవంతం చేయాలి

శ్రీకాకుళం : జల జీవన్ మిషన్ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జల్ జీవన్ మిషన్‌పై ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెండరు స్థాయిలో ఉన్న వాటిని సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. ఉద్దానం ప్రాంతానికి సంబంధించి అటవీశాఖ వద్ద ఉన్న సమస్య గురించి సంబంధిత డిఇ కలెక్టర్‌కు వివరించారు. ప్రతి ఎఇ వద్ద పైపులు నిల్వ ఎంత ఉన్నది నోట్ చేయాలన్నారు. రోజు వారీగా పురోగతి చూపించాలన్నారు. ఎచ్చెర్ల మండలంలో సైట్ సమస్య ఉందని కలెక్టర్‌కు డిఇ చెప్పగా, డిఇలందరికీ సైట్ సమస్య ఉంటే ఆ జాబితా ఎస్ఇకి ఇవ్వాలని ఆదేశించారు. నియోజకవర్గాల వారీగా పనుల పురోగతిపై డిఇలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ పి.శంకర్‌బాబు, డిఇలు, ఎఇలు తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తల కోసం
www.prajasakti.com
epaper.prajasakti.com

హమ్మయ్య..!

- రాష్ట్రంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎసిబి దాడులు
- జిల్లా మినహాయింపు పై చర్చ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రాష్ట్రంలోని 120 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏకకాలంలో అవినీతి నిరోధక శాఖ బుధవారం తనిఖీలు నిర్వహించింది. జిల్లాలో 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. జిల్లాలోని కార్యాలయాల్లో ఎటువంటి దాడులు లేకపోవడంతో ఆ శాఖ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఫిర్యాదులు ఎక్కువగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఎసిబి అధికారులు దాడి చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాకు సంబంధించి ఫిర్యాదులు లేవని కొందరు అంటుండగా, ఎంపిక చేసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే ఎసిబి దాడులు చేసిందని మరికొందరు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధానంగా రిజిస్ట్రేషన్లలో పర్సంటేజీలు తీసుకోవడం, భూముల అమ్మకం, కొనుగోలులో జబ్లింగ్ సర్వే నంబర్, డ్యూయల్ రిజిస్ట్రేషన్లు, తప్పుడు సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్లు వంటి అంశాల్లో ఎక్కువగా డబ్బులు చేతులు మారడం జరుగుతుంది. మరోవైపు పర్సంటేజీలు లేనిదే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనులు సకాలంలో జరగవని, లంచాలు ఇస్తేనే వాయిదా లేకుండా జరుగుతాయన్న విమర్శలు ఉన్నాయి. అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ అవినీతి చోటుచేసుకుంటోందన్న ఆరోపణలు ఉన్నాయి. ఎసిబి దాడులు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి.




మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న శంకర్ రెడ్డి

బిసి సంక్షేమశాఖ మంత్రికి వినతి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ బిసి సంక్షేమ శాఖ నుంచి వచ్చిన పిలుపు మేరకు, మంత్రి సవిత దృష్టికి రెడ్డిక సామాజిక తరగతి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర బిసి సాధికారిత సమితి కన్వీనర్ కొండ శంకర్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. బుధవారం విజయవాడ గొల్లపూడి బిసి భవన్‌లో సమావేశం నిర్వహించిన సందర్భంగా వారిని మర్యాద పూర్వక కలయికలో భాగంగా రెడ్డిక సామాజిక తరగతికి చెందిన సమస్యలు పరిష్కారం, అభివృద్ధి కొరకు చర్చించడం జరిగిందన్నారు. ప్రధానంగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో అత్యధికంగా రెడ్డిక సామాజిక తరగతి ఎక్కువమంది ఉన్నారని, నియోజకవర్గ కేంద్రంలో రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. అదే విధంగా పేదరికం కారణంగా వంద యూనిట్లు ఉచిత విద్యుత్, పాడిరైతులకు ఆవులు, మేకలు, గొర్రెలు సబ్సిడీపై అందించాలని వినతిపత్రం అందించినట్లు శంకర్ రెడ్డి తెలిపారు.



రేషన్ సరుకులు అందజేస్తున్న కూటమి నాయకులు

మత్స్యకారులకు రేషన్ సరుకుల పంపిణీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మొంథా తుపాను ప్రభావితానికి గురైన మత్స్యకారుల కుటుంబాలకు బుధవారం మండలం బూర్జిపాడు పంచాయతీ డొంకూరులో కూటమి నాయకులు సమక్షంలో ఒక్కొక్క మత్స్యకార కుటుంబాలకు రేషన్ సరుకులు పంపిణీ చేశారు. కుటుంబానికి 50 కేజీలు చొప్పున బియ్యం, పప్పు, బంగాళా దుంపలు, నూనె ప్యాకెట్స్ తదితర నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సంతోష్ కుమార్, టిడిపి మండల అధ్యక్షుడు లోపింటి పద్మనాభం, పిఎసిఎస్ అధ్యక్షులు పెద్దిని బాబ్జి, మాజీ ఎంపిపి దక్కత ఢిల్లీరావు, జనసేన నాయకులు కృష్ణయ్య, టిడిపి నాయకులు మెరుగు సూర్యనారాయణ, దక్కత కామేశ్వరరావు, సాడి సహదేవ్ రెడ్డి, మండల యూత్ ప్రెసిడెంట్ బోర యువరాజ్, బోర ప్రసాద్, దున్న లోకనాథం, మాజీ ఎంపిటిసి చీకటి సూర్యనారాయణ, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య కార్మికులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి- రణస్థలం

వర్షాకాలంలో ప్రజలకు వచ్చే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజల యొక్క ఆరోగ్య పరిరక్షణ దృష్టిలో పెట్టుకొని మండల కేంద్రం, జె.ఆర్.పురం పంచాయతీలో 14 వార్డుల్లో అన్ని వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ జల్లించడం జరిగిందని డిప్యూటీ ఎంపిడిఒ ప్రసాద్, సర్పంచ్ బవిరి రమణ, ఇన్‌ఛార్జి కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వంటి విష జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా దానిని దృష్టిలో పెట్టుకుని బ్లీచింగ్ పౌడర్ జల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా తమ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ మేస్త్రి పాణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి- నరసన్నపేట

క్రీడలతోనే శారీరక, మానసిక ఆరోగ్యం ఉంటుందని సిఐ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం నరసన్నపేటలో మండలస్థాయి క్రీడాపోటీలను ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, మేరా యువభారత్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా సిఐ శ్రీనివాసరావు, సబ్ ఇన్స్పెక్టర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందన్నారు. వాలీబాల్, ఖోఖో, పరుగు పందెం, బ్యాడ్మింటన్ పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు మేరా యువభారత్ డిప్యూటీ డైరెక్టర్ వెంకట ఉజ్వల్ చేతులమీదుగా బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లత, యువభారత్ వాలంటీర్లు జి.వెంకటరమణ, ఉమామహేశ్వరరావు, టిడి భోగేశ్వరరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న సింహాచలం

అగ్ని ప్రమాద బాధితులకు సహాయం

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని బుడుమూరులో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు పూరిళ్లు కాలిపోయిన విషయం తెలుసుకున్న రవితేజా డెవలపర్స్ ఎండి పోకతోట సింహాచలం బుధవారం బుడుమూరులో అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబాలకు ముంతా శ్రీరామ్, గోపి, పైడయ్య కుటుంబాలకు నిత్యావసర సరకులు, దుస్తులు, వంటపాత్రలు తదితర సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాటి మనిషి ఆపదలో ఉన్న వారికి మానవతా దృక్పథంతో ఆదుకోవాలనే సంకల్పంతో చిరు సహాయం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి బొడ్డ రవిబాబు, మధు, కుప్పిలి అప్పన్న, గ్రామపెద్దలు రవితేజ తదితరులు పాల్గొన్నారు.

విలీన పంచాయతీ రోడ్లు దారుణం



వెంకటాపురం రోడ్డు దుస్థితి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

కుశాలపురం గ్రామాన్ని శ్రీకాకుళం నగరపాలక సంస్థలో విలీనం చేశారు. నగర పాలక సంస్థ ఈ గ్రామ అభివృద్ధికి కనీస చర్యలు తీసుకోవటం లేదు. గ్రామపంచాయతీగా ఉంటే జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన వంటి పథకాలతో ప్రగతి సాధించేవి. గ్రామీణ ప్రాంతానికి, పట్టణ ప్రాంతానికి దేనికి చెందకుండా గ్రామ ప్రగతి కుంటుబడుతుంది. కుశాలపురం పంచాయతీ పరిధిలో యాతపేట, వెంకటాపురం, అంబేద్కర్ నగర్ ఉన్నాయి. ఈ గ్రామ పంచాయతీలో రోడ్లు ప్రధాన సమస్యగా దర్శనమిస్తున్నాయి. గత ఐదేళ్లగా వెంకటాపురం రోడ్డు గోతులమయంగా, అధ్వానంగా దర్శనమిస్తుంది. రోడ్డు నిర్మాణం మాత్రం జరగటం లేదు. పాలిటెక్నిక్ కళాశాల ఆనుకొని యాతపేట నుంచి సింహద్వారం వరకు ఉన్న కిలోమీటరు రోడ్డు దారుణంగా తయారైంది. వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలల బస్సులు సైతం రాకపోకలు సాగించేందుకు పాట్లు పడుతున్నాయి. సమస్య వందలసార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. కుశాలపురం మండల పరిషత్ పాఠశాల నుంచి బైపాస్ వరకు ఉన్న రోడ్డు పూర్తిగా పాడైంది. గోతులమయంగా మారి, నీటితో నిండి ఉంది. ఈ రోడ్డు మరమ్మతులు జరగక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో గ్రామం ఉంది. శ్రీకాకుళం నగరపాలక సంస్థలో ఉంది. శ్రీకాకుళానికి చెందిన ప్రజాప్రతినిధులు స్పందించడం లేదు. నగరపాలక సంస్థ కావడం వల్ల ఎచ్చర్ల ప్రజాప్రతినిధులు పట్టించుకోవటం లేదు. గ్రామ పంచాయతీగా మార్పు చేయాలని



కుశాలపురంలో పాఠశాల నుంచి బైపాస్ వరకు ఉన్న రోడ్డు

ప్రజలు డిమాండ్ చేస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. నగర పాలక సంస్థలో విలీనం చేసినప్పటి నుంచి పంచాయతీ ఎన్నికలు, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరగలేదు. అధికారులు స్పందించక, అభివృద్ధికి ప్రయత్నించే ప్రజాప్రతినిధులు లేక పంచాయతీ ప్రగతి కుంటుపడుతుంది. కనీసం రోడ్లయినా నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అందుబాటులో రబీ విత్తనాలు

ప్రజాశక్తి- ఆముదాలవలస

మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో రబీ పంటలకు అవసరమైన విత్తనాలు రాయితీ ధరకే అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు తెలిపారు. పెసర 6.16 క్వింటాలు, మినుము 8.24 క్వింటాలు, కట్టె జనుము 24.3 క్వింటాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ విత్తనాల పంపిణీ ఆన్‌లైన్ పద్ధతి ద్వారా జరగనుందని, విత్తనాలు అవసరమున్న రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలో బెల్ట్ షాపులు నిర్వహించిన వారికి, ప్రోత్సహించిన వారికి కఠిన చర్యలు తప్పవని టెక్కలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్.కె.మీరాసాహెబ్ తెలిపారు. బుధవారం పాత కేసుల్లో పట్టుబడిన 9 మంది వ్యక్తులను పిలిపించి కౌన్సిలింగ్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం టెక్కలి తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. పాత కేసుల్లో ఉన్న మిగతా వారిని కూడా బైండోవర్ చేస్తామని తెలిపారు. మద్యం షాపుల యజమానులు ఎవరైనా బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తే షాపు లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. బైండోవర్ కేసు ఏడాది వరకు అమల్లో ఉంటుందని, దీనిని అతిక్రమిస్తే రూ.2 లక్షలు జరిమానా విధిస్తామన్నారు. ప్రజలు కల్తీ మద్యంపై అప్రమత్తంగా ఉండి సమాచారాన్ని టోల్ ఫ్రీ నెంబర్ 14405 ద్వారా సమాచారం అందజేయాలన్నారు.

ఉద్యోగులు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

ప్రజాశక్తి- పొందూరు



తులసీరావు

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, కేంద్ర ప్రభుత్వ కార్పొరేషన్ సంస్థలకు సంబంధించిన ఉద్యోగులు డిసెంబర్ 30లోగా తమ జీవన ప్రమాణ పత్రం (లైఫ్ సర్టిఫికేట్)లను సమర్పించాలని పొందూరు సబ్‌ట్రెజరీ అధికారి మెట్ట తులసీరావు పేర్కొన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్లు, రాష్ట్రంలో పెన్షన్ తీసుకుంటున్న ఇతర రాష్ట్ర పెన్షనర్లు మాత్రం జనవరి, ఫిబ్రవరి 2026లో మాత్రమే తమ లైఫ్ సర్టిఫికెట్లును సమర్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు లైఫ్ సర్టిఫికెట్ ఆన్‌లైన్‌లోగాని, అలాగే ఎవరైనా ఆరోగ్య సమస్యలు, వృద్ధాప్యం వలన బయోమెట్రిక్ పడని వారు తమ లైఫ్ సర్టిఫికెట్‌ను ఫిజికల్‌గా ఇవ్వదలచిన వారు జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28లోగా తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు గమనించి లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించేందుకు రావాలని కోరారు.

బూటకపు హామీలతో మోసం

నరసన్నపేట : మండలం యారబాడు, విఎన్ పురం క్లస్టర్ పరిధిలో బుధవారం రచ్చబండ కార్యకర్తలతో కృష్ణచైతన్య కార్యక్రమంలో ధర్మాన కృష్ణ చైతన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఒక్క కొత్త పింఛన్ ఇవ్వలేదని, 50 ఏళ్లకు పింఛన్ ఇస్తామన్న చంద్రబాబు భర్త చనిపోయిన వితంతువులకు, 60 ఏళ్లు నిండిన వాళ్లకు కూడా పింఛన్ ఇవ్వని దౌర్భాగ్యుడు చంద్రబాబు అని విమర్శించారు. ప్రజలకు బూటకపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ఆరంగి మురళిధర్, జెడ్‌పిటిసి చింతు రామారావు, వైసిపి మండల అధ్యక్షులు లుకలాపు రవి, జిల్లా అంగన్వాడీ విభాగం అధ్యక్షులు పుట్ట ఆదిలక్ష్మి, అన్ని విభాగాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

డెల్ఫీ టివిఎస్‌కు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఐతమ్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభతో మరోసారి విశిష్టత సాధించారు. ప్రముఖ ఆటోమొబైల్ తయారీ సంస్థ డెల్ఫీ టివిఎస్ నిర్వహించిన క్రాంప్స్ ఇంటర్వ్యూలో ఐతమ్ విద్యార్థులు విజయాన్ని సాధించి 117 మంది ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఎంపికైన వారిలో బి.టెక్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ విభాగాల విద్యార్థులు 59 మంది, డిప్లొమా విభాగాల విద్యార్థులు 58 మంది ఉన్నారన్నారు. ఎంపికైన వారికి రూ.3 లక్షల ప్రారంభ వార్షిక వేతనమని తెలిపారు. ఈ విజయానికి విద్యార్థుల సాంకేతిక నైపుణ్యం, పరిశ్రమలపై అవగాహన, ఇంటర్వ్యూలో ప్రదర్శించిన ఆత్మవిశ్వాసం ప్రధాన కారణాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎ.ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కళాశాల తరచూ నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్ర మాలు, వర్క్‌షాప్‌లు, సాంకేతిక శిక్షణలు విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించాయని తెలిపారు. కార్యక్రమంలో డీన్ ప్లేస్‌మెంట్స్ డా. ఎం.సంతోష్‌కుమార్, ప్లేస్‌మెంట్ హెడ్ డా. శ్రీకాంత్, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు

శ్రీకాకుళం సిటీ: వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు సేవాభావంతో నిర్వహిస్తున్నారని, స్టార్ వాకర్స్‌కు అభినందనలు తెలియజేస్తున్నట్లు రాష్ట్ర జాతీయ రహదారులు, భవనాల శాఖ ఇంజనీరింగ్ చీఫ్ వి.రామచంద్ర అన్నారు. శ్రీకాకుళం స్టార్ వాకర్స్ క్లబ్ బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా బాక్సింగ్ శిక్షణ అభ్యర్థుల ప్రోత్సాహక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జర్నలిస్టు జోగినాయుడు మాట్లాడుతూ జిల్లాలో బహుదానది వంతెన దగ్గర నుంచి శ్రీకాకుళం పట్టణంలోని రెండు బ్రిడ్జిలు, అలాగే అనేక రహదారుల రూపకల్పనలో, మంజూరులో రామచంద్ర కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లయన్ వావిలపల్లి జగన్నాథ నాయుడు, గుప్తా, గేదెల ఇందిరాప్రసాద్ పాల్గొన్నారు.

విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ



తయారైన మురుకులను ప్రదర్శిస్తున్న శాస్త్రవేత్త సునీత

ప్రజాశక్తి- ఆముదాలవలస

పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో మూడురోజుల పాటు జరిగిన చిరుధాన్యాల సాగు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ వృత్తి శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ముందుగా శిక్షణ పొందిన రైతులకు కెవికె ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలు, వాటి విలువాధారిత ఉత్పత్తులకు ప్రస్తుత మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. ఈ శిక్షణలో పాల్గొనే వారు ఉపాధి అవకాశాలను సృష్టించుకునేలా ప్రయత్నించాలని సూచించారు. అనంతరం వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ జ్యోతిబసు మాట్లాడుతూ మేజర్ మిల్లెట్స్ సాగు విధానం వాటికున్న డిమాండ్స్‌పై వివరించారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత మాట్లాడుతూ చిరుధాన్యాలు పోషక విలువలు కలిగి ఉంటాయని, వాటి సేవనం మధుమేహం, గుండె జబ్బులు, కొన్ని రకాల కేన్సర్‌లను నిరోధించడంలో దోహదపడతాయన్నారు. రాగిజావలో పుష్కలంగా కాల్షియం, ఖనిజ లవణాలు ఉండడం వలన వీటిని పోషక గనులుగా పిలుస్తారన్నారు. అనంతరం జొన్న మురుకులు, లడ్డూల తయారీ విధానాన్ని ప్రదర్శించారు. అనంతరం డాక్టర్ ఎస్. ప్రశాంతి కెవికె ఉట్టుకూరు నుంచి ఆన్‌లైన్ ద్వారా చిరు ధాన్య ప్రాథమిక ద్వితీయ ప్రాసెసింగ్ వాటి యంత్రాలు బ్రాండింగ్, ప్యాకింగ్, మార్కెటింగ్‌పై శిక్షణ అందించారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్, డాక్టర్ జి.ఎస్ రాయ్, రైతులు, గ్రామీణ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎఎస్ఐ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

కంచిలి పోలీస్‌స్టేషన్‌లో ఎఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న తెలుకల రామారావు అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. సుమారు 65ఏళ్ల వయసున్న డబ్బూరి నారాయణ అనే వృద్ధుడు బిక్షాటన చేసుకుంటూ ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద రాత్రిపూట నిద్రిస్తుండేవాడు. నాలుగు రోజుల క్రితం. తీవ్ర అనారోగ్యంతో ఆర్‌టిసి కాప్లెక్స్ వద్ద ఉండగా స్థానికులు గుర్తించి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మంగళవారం సాయంత్రం ఆస్పత్రిలోనే మృతి చెందాడు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో అసిస్టెంట్ రైటర్‌గా విధులు నిర్వహిస్తున్న రంజిత్ ఎఎస్ఐ రామారావుకు సమాచారం ఇవ్వడంతో బుధవారం ఉదయం ఆస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని అంతిమ రథంపై బాహుదానదికి తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. పెద్ద కర్మకూడా జరిపిస్తానని, గత 20ఏళ్లుగా 64 అనాథ శవాలకు దహన కార్యక్రమాలు నిర్వహించటంతో పాటు పెద్దకర్మ జరిపి 50 మంది నిరుపేదలకు అన్నదానం



అంత్యక్రియలకు తీసుకువెళ్తున్న రామారావు

చేసేవాడినని రామారావు తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారని, కుమారుడు మద్యానికి బానిపై కొన్నేళ్ల క్రితమే మృతి చెందాడని, కూతురికి వివాహమై కోటబొమ్మాళిలో ఉంటుందని, ఎవరూ పట్టించుకోక పోవటంతో బిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్నాడని, కుమార్తె గీతకు ఫోన్ చేయటం జరిగిందని, ఆమెది నిరుపేద కుటుంబం కావటంతో బస్సు టికెట్టుకు కూడా డబ్బులు లేవని చెప్పటంతో డబ్బులు కూడా పంపించి ఇచ్ఛాపురం రప్పించడం జరిగిందని రామారావు తెలిపారు.



లాల్యను అభినందిస్తున్న ఎంఇఒలు

మాక్ అసెంబ్లీకి విద్యార్థిని ఎంపిక

పలాస: నవంబర్ 26 రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో 8, 9, 10వ తరగతులు చదువుతున్న విద్యార్థులకు మూడు స్థాయిల్లో పోటీలు నిర్వహించినట్లు ఎంఇఒలు శ్రీనివాసరావు, శ్రీకాంత్ తెలిపారు. ఈ నెల 1న కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలాస మండలం నుంచి టి.నవ్య శ్రీ, ఆర్.సిహెచ్ లాల్య, సి.హెచ్. షర్మిల, మందస మండలం నుంచి బి.షాలిని, ఎ.అమృత, బి.లాస్య, వజ్రపుకొత్తూరు మండలం నుంచి యు.హేమంత్, డి.భాహిత, టి.హనీలకు వ్యాసరచన పోటీలు, ఉపన్యాస పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహించి వారిలో మొదటి ముగ్గురికి విజేతలుగా నిర్ణయించారు. వారిని మాక్ అసెంబ్లీ కార్యక్రమానికి ఎంపిక చేయడం జరిగిందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. విజేతలు వివిధ పోటీల్లో మొదటి స్థానాన్ని కాశీబుగ్గ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న ఆర్‌సిహెచ్ లాల్య, రెండో స్థానం టి.నవ్య శ్రీ, మూడో స్థానం గరుడ భద్ర హైస్కూల్‌కు చెందిన టి.హనీలు కైవసం చేసుకున్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఎస్.మురళి జె.ఎల్ డైట్ వమరవెల్లి, సిహెచ్ కృష్ణారావు హెచ్ఎం హరిదాసుపురం, బి.ప్రసాదరావు జెఎల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పలాస, ఎస్.మాధవరావు, బ్రాహ్మణతర్ల హైస్కూల్, సతీష్, ప్రభుత్వ పాఠశాల పలాస నుంచి వ్యవహరించారు. కార్యక్రమంలో డిఇఒ ఎ. రవిబాబు, మూడు మండలాల మండల విద్యాశాఖ అధికారులు, హెచ్ఎంలు పాల్గొన్నారు. అయితే లాల్య ప్రముఖ వైద్యురాలు మేఘన కుమార్తె.

రాష్ట్రస్థాయి తైక్వాండోలో బంగారు పతకం

ఇచ్ఛాపురం: స్థానిక సురంగ్ రాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి చాట్ల గిరి రాష్ట్రస్థాయి తైక్వాండో క్రీడలో బంగారు పతకం సాగించారు. కాశ్మీర్, అరుణాచల్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు పయనమవుతున్న గిరికి స్థానిక బంగారు వ్యాపారవేత్త మధు ఆర్థికసాయం అందించి అశ్వీరదించారు. కోచ్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలుపుదల

శ్రీకాకుళం: 33/11 కెవి రాగోలు, అలికం, రాగోలు సెక్షన్ పరిధిలో 11కెవి పొన్నం, కొత్త రోడ్డు, తోటాడా, రాగోలు టౌన్ ఫీడర్ల పరిధిలో చెట్టుకొమ్మలు తొలగింపు, మరమతులకు శుక్రవార ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీకాకుళం మండల పరిధిలో గల పొన్నాం, నైరా, చల్లపేట, వెంకటాపురం, గొల్లపేట, బామ్మడివాని పేట, కరిమిల్లిపేట, రోనంకి, రామకృష్ణా పురం, రాగోలు, కొత్త రోడ్డు, బావాజీపేట, గూడెం, అక్కివరం, ధూసి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పైడి యోగేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

భవిష్యత్ ప్రణాళికలు రచించుకోవాలి

లావేరు : కళాశాల స్థాయి నుంచే విద్యార్థులు భవిష్యత్ ప్రణాళికలు రచించుకోవాలని ఆ దిశగా వెళ్లాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. బుధవారం తామాడ ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలోని ప్రతిగదిని పరిశీలించారు. ఈ సందర్భంగా భోజనం, వసతి సదుపాయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పలు ప్రశ్నలు వేసి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా పాఠశాలకు రూ.70 వేలు విలువగల ఇన్వెర్టర్‌ను అందజేశారు. లావేరు టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్, మాజీ సర్పంచ్ గొర్లె శ్రీనువాసరావు, ఎస్ఎంసి చైర్మన్ వెంకటరావు, రణస్థలం సర్పంచ్ పిన్నింటి భానోజీనాయుడు, టిఎన్ఎస్ఎఫ్ నాయ కుడు శంభాన రమేష్, టిడిపి నాయకుడు బాసి గోవిందరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

సంతబొమ్మాళి: మండలంలోని సీతానగరం గ్రామానికి చెందిన బత్సల భీమారావు, కాలేమ్మ, ఎండయ్య మృతుల కుటుంబాలను జనసేన ఇన్‌ఛార్జి కణితి కిరణ్ కుమార్ బుధవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ ఆత్మస్థైర్యం నింపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కుమార్, స్వరూప్ రెడ్డి, వాడ్రేవు కృష్ణారావు, రమణ, గవరయ్య, బ్రహ్మనందం, పాపారావు, గిరి, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

గోతుల రహదారులతో రాకపోకలు ఎలా?

ఎచ్చెర్ల: మండలంలో తోటపాలెం నుంచి కొత్తపేట మీదుగా సెగిడిపేట, అంబేద్కర్ నగర్, చిన, పెద్ద కొయ్యవానిపేట, రుప్పపేట, గొలివివాని పేట, జరజాం వెళ్లే రహదారి అడుగడుగునా పెద్దపెద్ద గోతులు ఏర్పడి రాళ్లు తేలి బురదమయంగా తయారైంది. ఈ రహదారి తోటపాలెం, కొత్తపేట, ముద్దాడ, జరజాం పంచాయతీలను కలుపుతుంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముద్దాడకు చెందిన ఓ గర్భిణీ ప్రసవం కోసం 108 వాహనానికి ఫోన్ చేయగా ఆ అంబులెన్స్ డ్రైవర్ నేరుగా ఆ గ్రామానికి అంబులెన్స్ రాదని కరాకండిగా తెలియజేశారు. ఆ రోడ్డు మార్గంలో అంబులెన్స్ వస్తే మరమ్మతులకు గురవుతుందని ఆ గర్భిణీ కుటుంబ సభ్యులకు తెలిపారు. గర్భిణీని తోటపాలెం జంక్షన్ వరకు ఆ కుటుంబ సభ్యులు తీసుకురాగా అక్కడ నుంచి అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. తమ గ్రామానికి ఏ వాహనం రావటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే వ్యవసాయదారులు ఉత్పత్తులను కూడా రవాణా చేయలేక పోతున్నామని, విద్యార్థులు కళాశాలలకు వెళ్లలేక నిత్యం అవస్థలు పడుతున్నారని వాపోతున్నారు. ఈ సమస్యను



రాళ్లు తేలిన ముద్దాడ రహదారి

పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లిన పరిష్కారం కాలేదని స్థానికులు వాపోతున్నారు. ఈ సమస్యపై పంచాయతీ రాజ్ ఎఇ సిస్టు పోలినాయుడు దృష్టికి ప్రజాశక్తి తీసుకెళ్లగా ఈ రహదారిలో తోటపాలెం నుంచి అంబేద్కర్ నగర్ వరకు 5.6 కిలోమీటర్లు పొడవున రూ.2.9 కోట్లు నాబార్డు నిధులతో బిటి రహదారి నిర్మాణం ఒకటి, రెండు రోజుల్లో ప్రారంభమవుతుందన్నారు. దీంతో సగం సమస్య పరిష్కార మవుతుందని, మిగిలిన రహదారిని ఉపాధిహామీ పథకంలో నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపించామని చెప్పారు.

గ్యాస్ సిలిండర్ లీక్‌తో మంటలు

ప్రజాశక్తి- పలాస

కార్తీక పున్నమి సందర్భంగా ఇంటిలో పిండివంటలు చేస్తుండగా గ్యాస్ సిలెండర్ లీకై మంటలు వ్యాపించాయి. దీంతో ఆ దాటికి ఇంటిలో ఉన్న వస్తుసామగ్రి, గృహోపలంకరణలన్నీ దగ్ధమయ్యాయి. అగ్నిమాపకశాఖ సిబ్బంది చేరుకొని మంటలను అతికష్టం మీద అదుపులోకి తీసుకు వచ్చారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానిక అన్నపూర్ణ ఆశ్రమవీధిలో బుధవారం ఈ సంఘటన జరిగింది. కాలనీలో నివాసం ఉంటున్న గిన్ని సింహాచలం ఇంటిలో కార్తీక పున్నమి సందర్భంగా గ్యాస్ పొయ్యి కిందికు దించి పిండివంటలు చేస్తున్నారు. ఈ క్రమంలో చిన్న మంటలు గ్యాస్ సిలెండర్ నుంచి వచ్చాయి. దీనిని అదుపు చేసే ప్రయత్నం చేయగా ఆ మంటలు పెద్దవి కావడంతో అంతా పరుగులు తీశారు. అనంతరం గ్యాస్ రెగ్యులేటర్ సైతం అదుపు చేయడానికి అవకాశం లేకుండా మంటలు వ్యాపించడంతో ఆ ప్రాంతంలో ఉన్న వస్తు సామగ్రి అంతా కాలిబూడిదైంది. అగ్నిమాపకశాఖ సిబ్బంది చేరుకున్నా ఆ ప్రాంతానికి వెళ్లడానికి దారి లేకపోవడంతో అతికష్టంపై ఫోమ్, ఇతర సామగ్రి తీసుకువెళ్లి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. సిబ్బంది మంటలను అదుపు చేయలేక పోయి ఉంటే భారీ ప్రమాదం జరిగి ఉండేదని అగ్నిమాపక అధికారులు తెలిపారు.



పహారా కాస్తున్న మెరైన్ సిబ్బంది

తీర ప్రాంతంలో గస్తీ ముమ్మరం

ప్రజాశక్తి- కవిటి

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని తీర ప్రాంతంలో ముమ్మర గస్తీ ఏర్పాటు చేసినట్లు బారువ మెరైన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్ఒ రమేష్ తెలిపారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని పుక్కలపాలెం సముద్ర తీరంలో హెడ్ కానిస్టేబుల్ టి.ఉమామహేశ్వరరావు, సిబ్బంది పిసి రవీంద్ర, ప్రకాష్ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. ప్రజలు సముద్రంలోకి ఈతకు వెళ్లకుండా పహారా కాశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి- నరసన్నపేట



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లత

పర్యావరణ పరిరక్షణపై ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.లత సూచించారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్తీక మాసం విశిష్టత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు నెలల్లో ఆస్వీజమాసం (నవంబర్) వర్షాభావం ఎక్కువగా ఉంటుంది కనుక మొక్కలు పెంపకానికి అనుకూలంగా ఉంటుందని, మొక్కలు పెంపకం వలన పచ్చదనం ఏర్పడి తద్వారా కాలుష్యం నివారించవచ్చునన్నారు. వీటిపై విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శాంతి హేమ, అధ్యాపకులు అన్నాజీరావు, త్రినాథరావు, ఢిల్లీశ్వరరావు, నాగరాజు, కృష్ణవేణి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



దుకాణ యజమానులతో మాట్లాడుతున్న ఎస్ఐ సత్యనారాయణ

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు

పొందూరు: పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ వి.సత్యనారాయణ హెచ్చరించారు. బుధవారం పట్టణంలో మార్కెట్, బస్టాండ్ సమీపంలో ట్రాఫిక్ నియమాలపై దుకాణాల నిర్వాహకులతో మాట్లాడారు. పట్టణంలో దుకాణాల నిర్వాహకులు, యజమానులు తమ పరిధిని దాటి రహదారులపై సామగ్రిని పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే దుకాణాలకు వచ్చే కొనుగోలుదారులు కూడా తమ వాహనాలను రహదారులపై ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తే వాహనాలకు అపరాధ రుసుం విధించడంతో పాటు దుకాణాల నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఇఒ కె.మోహన్‌బాబు, వార్డు సభ్యులు మురళీ, పంచాయతీ సిబ్బంది తదితరులున్నారు.

అలరించిన స్వర నీరాజనం



కచేరీ నిర్వహిస్తున్న కళాకారులు

కవిటి: మండలంలోని కొమ్ము పుట్టుగ గ్రామం బుధ వారం సాయంత్రం సంగీత లహరిలో మునిగి పోయింది. శ్రీ వెంకటేశ్వర స్వామి మండపం 35వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సంగీత స్వర నీరాజనం కార్యక్రమం ఆహుతులను మంత్రముగ్ధులను చేసింది. ఆకాశవాణి 'ఎ' గ్రేడ్ వయోలిన్ కళాకారుడు మహాదాస్ నీలాద్రి, మృదంగం వాయించిన 'ఎ' గ్రేడ్ కళాకారుడు మహాదాస్ ఏడుకొండలు, గాత్రసేవ అందించిన 'ఎ' గ్రేడ్ కళాకారిణి కుమారి లంక రాజేశ్వరి తమ స్వర, నాద సమన్వయంతో వేదికను సంగీతమ యంగా మార్చారు. తదనంతరం కమిటీ సభ్యులు కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి పరిసర గ్రామాల సంగీతాభిమానులు, కళాకారులు, శ్రీ వెంకటేశ్వర స్వామి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

రేపు రాజేశ్వరరావు వర్ధంతి సభ

సోంపేట: మండలంలోని బారువ చాట్ల బజార్ సమీపంలోని గంటి రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య మండపం వద్ద శుక్రవారం నిర్వహించబోయే గంటి రాజేశ్వరరావు వర్ధంతి, అక్టోబర్ విప్లవ వార్షికోత్సవ సభను విజయవంతం చేయాలని స్మారక సభ నిర్వహణ కమిటీ ఒక ప్రకటనలో కోరారు. కార్పొరేట్లకు ప్రజల సంపదను దోచిపెడుతున్న రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా పోరాడిన గంటి రాజేశ్వరరావుకు ఘనమైన నివాళ్లర్పించాలన్నారు. సాయంత్రం మూడు గంటలకు జరిగే ఈ కార్యక్రమాలకు ప్రజలంతా పెద్దఎత్తున పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు.



ఉపాధ్యాయులకు సైన్స్ కిట్లు అందజేస్తున్న యూత్‌క్లబ్ ప్రతినిధులు

కెజిబివిలో బాలవికాస్

పొందూరు: మండలంలోని లోలుగు కెజిబివిలో బుధవారం బెజ్జిపురం యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో సంసిద్ధత, బాలవికాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ తరగతులను నిర్వహించారు. అనంతరం సైన్స్ ఉపాధ్యాయులకు సైన్స్ కిట్‌ను, లైబ్రరీ పుస్తకాలను కమ్యూనిటీ ఆర్గనైజర్‌లు కెల్ల శ్రావణి, ఎ.అప్పలనాయుడు చేతుల మీదుగా అందజేశారు. యూత్ క్లబ్ సభ్యులు, కెజిబివి ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిల్ సదస్సులో భమిడిపాటికి సన్మానం

అరసవల్లి: కేంద్ర మానవ వనరుల శాఖ, తెలుగు భాషా ప్రాధికార సంస్థ, నెల్లూరు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన రెండురోజుల జాతీయ సదస్సులో గాయత్రి కాలేజీ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్ మెంట్ కళాశాల తెలుగు విభాగాధిపతి భమిడిపాటి గౌరిశంకర్ 'దక్షిణాంధ్రయుగ సాహిత్యం తెలుగు పరివ్యాప్తి' అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా భాషా ప్రాధికార సంస్థ సంచాలకులు ఆచార్య మాడ భూషి సంపత్ కుమార్, యోగి వేమన విశ్వవిద్యాలయం ఎన్.ఈశ్వర‌రెడ్డి గౌరిశంకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనను గురజాడ విద్యాసంస్థల అధినేత జి.వి. స్వామి నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ కె.వి.వి.సత్య న్నారాయణ, డా. కె. మార్తాండ కృష్ణ అభినందించారు.

కేరాసింగిలో స్వర్ణాంధ్ర విజన్

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని కేరాసింగి, గూడ గ్రామాల్లో స్వర్ణాంధ్ర విజన్ 2047 కార్యక్రమం బుధవారం పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదేశాలతో నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు రాష్ట్ర అభివృద్ధి దిశగా తీసుకుంటున్న చర్యలను వివరించారు. 'స్వర్ణాంధ్ర విజన్ 2047' ద్వారా గ్రామస్థాయిలో అభివృద్ధి, విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాల్లో పురోగతి సాధించాలనే లక్ష్యంతో కార్యక్రమం నిర్వహించబడిందని తెలిపారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, మండల టిడిపి అధ్యక్షులు నంబాల వెంకటరావు, ఎఎంసి చైర్మన్ ప్రతినిధి బైరిసింగి దినకర్, ఎంపిటిసి ప్రతినిధి కదంబాల పైడిరాజు, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్ రెడ్డి, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మోహనరావు

నారీ శక్తిపై అవగాహన

సోంపేట: మండలంలోని బేసి రామచంద్రపురంలో బుధవారం రాత్రి బారువ ఎస్ఐ హరిబాబు నాయుడు ఆధ్వర్యంలో నారీ శక్తిపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, పిల్లల రక్షణపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం అమలులో ఉన్న చట్టాలను తెలియజేశారు. మహిళలు చట్టాలను తెలుసుకోవడం వల్లే రక్షణ పొందగలరన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ హరిబాబునాయుడు

బివికెలో కార్తీక పౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి- కవిటి

భారతీయ విద్యా కేంద్రం ఆధ్వర్యంలో ఆర్ష విజ్ఞాన భారతి, కవిటి పాఠశాలలో కార్తీక పౌర్ణమి సందర్భంగా విద్యార్థుల సమక్షంలో దీపోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎం.అనిల్ మాట్లాడుతూ కార్తీక మాసం ఆధ్యాత్మికత, సాంప్రదాయాల ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించారు. పాఠశాల ఆవరణ మొత్తం దీపాలతో నిండిపోవడంతో భక్తి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో శిరీష, ఢిల్లీరావు, కృష్ణ కుమార్, సుహాసిని, ఝాన్సీ, అంజలి, జ్యోతి, మాధికమ్మ, సరిత, రాజేశ్వరి, నిర్మల, లక్ష్మి, ధర్మారావు తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వేడుకలు నిర్వహిస్తున్న సిబ్బంది

కమిటీల నియామకం వేగవంతం చేయాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

మండలంలో అన్ని పంచాయతీల్లో వైసిపి అనుబంధ విభాగాల కమిటీల నియామకం వేగవంతం చేయాలని కృష్ణ చైతన్య సూచించారు. బుధవారం నరసన్నపేట వైసిపి కార్యాలయంలో ఆయన ముఖ్యఅతిథిగా నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల, పంచాయతీ కమిటీలు, అనుబంధ విభాగాల కమిటీలు త్వరగతిన పూర్తి చేసి పార్టీ కార్యాలయానికి అందజేయాలని కోరారు. ఈ బాధ్యత నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు తీసుకోవాలని సూచించారు. కమిటీలో ఉన్న ప్రతిఒక్కరికి ఐడి కార్డు వస్తుందని తెలిపారు. ఎంపిపి, జెడ్‌పిటిసి, ని యోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

బాలియాత్రను విజయవంతం చేయాలి

కోటబొమ్మాళి: కళింగ సామ్రాజ్య చారిత్రక వైభవాన్ని చాటి చెప్పే బాలియాత్రలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని బాలియాత్ర నిర్వాహక కమిటీ సభ్యులు ఎల్.కరుణాకర్ పిలుపునిచ్చారు. బుధవారం కోటబొమ్మాళిలో బాలియాత్ర ఆహ్వాన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 9న శ్రీముఖలింగం శ్రీ మధుకేశ్వరస్వామి సన్నిధిలో, వంశధార నది తీరంలో బాలియాత్ర జరుగుతుందని, ప్రజలందరూ పాల్గొని కళింగ సామ్రాజ్య పురాతన సంస్కృతి, సాంప్రదాయాలను కొనసాగించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గురు స్వాములు ధూపాన రమణారెడ్డి, కమ్ము కట్టు శ్రీనివాసరెడ్డి, నౌపడ మురళీధరరావు పట్నా యిక్, మెట్ట కాశేశ్వరరావు, మెట్ట.సింహాచలం, జనార్ధన గురుభవాని పాల్గొన్నారు.

వాహనమిత్ర రూ.25 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి-బలిజిపేట

ఆటో, మోటారు కార్మికులకు వాహనమిత్ర 25 వేల రూపాయలు ఇచ్చి, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి వై.మన్మథరావు, ఆటో యూనియన్ నాయకులు హరి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం బలిజిపేటలో బలిజిపేట, అరసాడ, నారాయణపురం, వంతరం, నూకలవాడ, పెదపెంకి, తుమరాడ ఆటో స్టాండ్లకు చెందిన ఆటో కార్మికుల సమావేశాన్ని ఆ సంఘం అధ్యక్షులు మోహన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత బస్సు పథకాన్ని తీసుకొచ్చి ఆటో కార్మికుల బతుకును కూటమి ప్రభుత్వం రోడ్డున పడేసిందని వాపోయారు. 70 శాతం మందికి ఉపాధి పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక పథకం ప్రవేశపెట్టినపుడు దాని ప్రభావం వల్ల ఎంతమందికి నష్టం జరుగుతుందో కూడా పరిశీలించి శాస్త్రీయంగా నష్ట పరిహారాన్ని, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు తిరుపతిరావు, గంగారావు, వెంకటేష్, రమేష్, శివ రాము, నారాయణ, సత్యనారాయణ, వై.శ్రీను, శంకర్రావు, నాయుడు పాల్గొన్నారు.

కాంట్రాక్టరే అధికారి

ప్రజాశక్తి-వీరఘట్టం

అధికారుల పర్యవేక్షణలో నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాల్సి ఉన్నా ఆ దిశగా ఎక్కడా జరగటం లేదు. దీనికి నిదర్శనం.. మండలంలోని వండవ సచివాలయ పరిధిలోని శృంగారాయపురంలో చేపడుతున్న పనులే. పంచాయతీ నిధులతో చేపడుతున్న కాలువ పనులను కాంట్రాక్టర్లు పర్యవేక్షణలోనే చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల పది కాలాలు ఉండాల్సిన కాలువ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించక పోవడం వల్ల ముచ్చటగా మూడు రోజులకే ముగుస్తాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రభుత్వ ఆశయాలకు గండి కొట్టకుండా పనుల జరిగే చోట పర్యవేక్షణ చేయాలని కోరుతున్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

సీతానగరం : మండలంలోని ఆర్.వెంకంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సిహెచ్ వెంకట్రావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో పరిశుభ్రత పాటించాలని, విద్యార్థుల కోసం ప్రత్యేకంగా చేసి మంచి పౌష్టిక ఆహారాన్ని అందించేలా చూడాలని కోరారు. విద్యార్థులకు మరుగుదొడ్ల తలుపులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, వాటికి మరమ్మతులు చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం సచివాలయ సిబ్బంది హాజరుపట్టికను పరిశీలించారు. అనంతరం అంటిపేట సచివాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

10న రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టంలోని అంబేద్కర్ కూడలిలో అంబేద్కర్ విగ్రహాన్ని పునర్నిర్మించాలని ఈ నెల పదో తేదీన రిలే నిరాహార దీక్ష చేపడుతున్నట్లు కెవిపిఎస్ నాయకులు ఎన్.సింహాచలం తెలిపారు. ఈ మేరకు బుధవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ మండల కేంద్రంలో రోడ్డు విస్తరణలో అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించారని తెలిపారు. రహదారి విస్తరణ చేపట్టి దాదాపుగా రెండేళ్లు గడిచినా అధికారుల అసమర్థత వల్ల ఇంతవరకు విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయలేదని చెప్పారు. అనేకసార్లు నిరసన చేపట్టినా, వినతులు ఇచ్చినా ప్రయోజనం లేదన్నారు. దీంతో రిలే నిరాహార దీక్షకు సిద్ధమవుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వి.ఇందిర, ఎన్.ప్రసాద్ రావు, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కెవిపిఎస్ నాయకులు

సమస్యలు పరిష్కరించకుంటే పోరాటానికి సిద్ధం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

మున్సిపల్ కార్మిక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, లేకుంటే పోరాటానికి సిద్ధమవుతామని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ సింహాచలం, సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ హెచ్చరించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి వారు మాట్లాడారు. పిఆర్‌సి కమిటీ కోసం కార్మికులు, ఉద్యోగులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈలోగా ఐఆర్ ప్రకటించి కార్మికుల వేతనాలు పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పథకాలన్నీ కార్మికులకు అందిస్తామని హామీ ఇచ్చిందని, వెంటనే అమలు చేయాలని కోరారు. నెల్లూరు, ఏలూరులో పని ప్రయివేటీకరణ చేసే విధానాలను పురపాలక శాఖ మంత్రి నారాయణ తీసుకువస్తున్నారని చెప్పారు. గతంలో 279 జిఒ అమలు చేసినప్పుడు వచ్చే సమస్యలే పునరావృతం చేయాలని చూస్తే కార్మిక వర్గ కోపాన్ని ప్రభుత్వం చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. మరోవైపు కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఈ సందర్భంగా డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా స్మార్ట్‌మీటర్లు బిగించొద్దు

ప్రజాశక్తి-పాలకొండ

వినియోగదారుల అనుమతి లేకుండా స్మార్ట్‌మీటర్లు బిగించవద్దని సిపిఎం నాయకులు దావాల రమణారావు స్పష్టంచేశారు. స్థానిక పోస్టాఫీసు రోడ్డులో కేటగిరి-2 ఉన్న వారికి స్మార్ట్‌మీటర్లు వేయడానికి బుధవారం విద్యుత్ సిబ్బంది ప్రయత్నించారు. దీనిని సిపిఎం నాయకులు రమణారావు అడ్డుకున్నారు. స్మార్ట్ మీటర్ వేయాల్సిందేనని వినియోగదారులపై ఒత్తిడి తేవడం సరికాదని చెప్పారు. ఈ విధానం తక్షణమే మానుకోవాలని, వినియోగదారుల అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్లు వెయ్యొద్దని చెప్పారు.

గ్రామీణ జీవనంపై వర్క్‌షాప్

ప్రజాశక్తి-భామిని

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ పరివర్తన్, వాసన్ ఎన్‌జిఒ ఆధ్వర్యంలో గ్రామీణ జీవన స్థితిగతులు, జీవనోపాధి, ఆహారపు అలవాట్లు, పంటలు మార్పులు.. అనే అంశంపై గ్రామస్థాయి ప్రజా ప్రతినిధులకు బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. గ్రామీణ సమాజంలో స్థిరమైన జీవనోపాధి అవకాశాలను పెంపొందించడం, పంటలు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై బృంద చర్చలు నిర్వహించారు. కార్యక్రమంలో వాసన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎ.రవీంద్ర, సంస్థ అసోసియేట్ డైరెక్టర్ మాకవరపు సన్యాసిరావు, వెలుగు లైవ్లీ హుడ్ డిపిఎం ధనలక్ష్మి, స్టేట్ కో ఆర్డినేటర్ వెంకట్ జయప్రకాశ్, ప్రోగ్రాం ఆఫీసర్ కళ్యాణ్ పాత్రో, కూన మనోజ్ కుమార్, వెలుగు ఎపిఎం మీసాల. చక్రపాణి పాల్గొన్నారు.

సహజ పద్ధతులతో నేల సంరక్షణ

ప్రజాశక్తి-సీతంపేట

సహజ వ్యవసాయ పద్ధతి అవలంబించడం ద్వారా నేల సంరక్షణతోపాటు ఆరోగ్యకర ఆహారం అభివృద్ధి చెందుతుందని నాబార్డ్ జనరల్ మేనేజర్ పహాడ్ సింగ్ తెలిపారు. ఐఎఫ్ఎడి, ఎబిఐసి అధికారులు మండలంలో బూర్జగూడ , గుజ్జి, దుగ్గి, చిన్న పొల్ల, జయపురం గూడ, గడిగుజ్జి గ్రామాల్లో పర్యటించారు. ఈ ప్రాంతంలో అమలవుతున్న వ్యవసాయ పద్ధతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల గురించి ఆర్ఢ్ డైరెక్టర్ సన్యాసిరావు వారికి వివరించారు.

అంతర్జాతీయ మహిళా రైతు దినోత్సవం ఆర్ఢ్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం పెద్దపేటలో ఘనంగా నిర్వహించారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహానికి డైరెక్టర్ సన్యాసిరావు పూలమాల వేసి నివాళ లర్పించారు. కార్యక్రమంలో శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస కల్యాణం

సీతంపేట : సీతంపేట గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శ్రీనివాస కల్యాణోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ దంపతులు హాజరయ్యారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి, జనసేన మండల అధ్యక్షులు మండంగి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.